PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :185 | పేజీలు : 8 | వెల రూ.5 | శనివారం 25.07.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh






# సింగరేణి విస్తరణకు .. పూర్తి మద్దతు

ప్రభాత సూర్యుడు

- రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌లోకి అడుగుపెట్టాలి
- బొగ్గుతో పాటు కొత్త రంగాలపై దృష్టి సారించాలి
- తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

సింగరేణిని బలోపేతం చేసి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతుగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటాయని భరోసా ఇచ్చారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి, జెన్‌కో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే 15 నుంచి 20 ఏళ్లలో ఇంధన రంగంలో భారీ మార్పులు చోటుచేసుకోనున్న నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ మినరల్స్, బ్యాటరీ స్టోరేజ్ వంటి ప్రత్యామ్నాయ రంగాల్లోకి విస్తరించాలని సూచించారు. తెలంగాణకు సింగరేణి ఆత్మవంటిదని, 130 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ సంస్థను మరింత బలోపేతం చేయడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం బొగ్గు రంగంలో ప్రైవేటు సంస్థల పోటీ పెరిగిందని, కేంద్ర ప్రభుత్వ బహిరంగ వేలం విధానంతో ప్రభుత్వ రంగ సంస్థలు కూడా పోటీని ఎదుర్కొంటున్నాయని భట్టి అన్నారు. నాణ్యత, నిర్వహణా వ్యయ నియంత్రణ, సమర్థ సేవల ద్వారా సింగరేణి తన స్థానాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. బొగ్గు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. తవ్వకాల సమయంలో మట్టి, రాళ్లు కలవకుండా పర్యవేక్షణ పెంచాలని, బొగ్గు శుద్ధీకరణను సమర్థంగా నిర్వహించి వివిధ గ్రేడ్ల బొగ్గును సరైన నిష్పత్తిలో బ్లెండింగ్ చేసి వినియోగదారులకు సరఫరా చేయాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుచూపు లేకపోవడం వల్ల సింగరేణి కొత్త బొగ్గు బ్లాకులను పొందడంలో వెనుకబడిందని ఆయన విమర్శించారు. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు బ్లాకుల కేటాయింపులోనూ నిర్లక్ష్యం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒడిశాలోని నైనీ బ్లాక్, తాడిచర్ల-2 ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించిందని తెలిపారు. సింగరేణి కేవలం ఒక వ్యాపార సంస్థ మాత్రమే కాదని, వేలాది కార్మిక కుటుంబాల జీవనాధారమని భట్టి అన్నారు. సంస్థ లాభాల్లో ఉంటేనే కార్మికుల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి గని స్థాయిలో యాజమాన్యం, కార్మిక సంఘాలు, కార్మికులతో చర్చలు నిర్వహించి సంస్థ భవిష్యత్తుపై కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇకపై బోర్డు సమావేశాలు పరిపాలనా అంశాలకే పరిమితం కాకుండా సంస్థ విస్తరణ, రాబోయే పదేళ్ల కార్యాచరణపై దృష్టి సారించాలని, కార్పొరేట్ సంస్థల మాదిరిగా లక్ష్యాలకు కాలపట్టిక రూపొందించి అమలు చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు

# ఉద్యోగ, ఉపాధికి దగ్గరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ప్రభాత సూర్యుడుక్యూర్ పరిధిలో చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్(ఓఆర్ఆర్) లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మొదటి విడతలో 17 నియోజకవర్గాల్లో మొత్తం 7,680 ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు సీఎం వెల్లడించారు. 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం జరుగనుందన్నారు. ఒక్కో ఫ్లాట్ నిర్మాణానికి సుమారు రూ.11 లక్షల వ్యయం అవుతుందని, ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని చెప్పారు. భూమి వ్యయాన్ని(ల్యాండ్ కాస్ట్) పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

## కేంద్ర మంత్రిరాజీనామా చేయాలి..

హైదరాబాద్,ప్రభాత సూర్యుడు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. యువత జవాబుదారీతనం కోరుతోందని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువతపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులు, యువత పోరాటానికి బీఆర్ఎస్ తరఫున కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. 25 రోజులుగా ఢిల్లీలో పార్టీలకు అతీతంగా యువత పోరాడుతోందన్నారు. యువతపై జరుగుతున్న దాడులను దారుణమని తీవ్రంగా ఖండించారు. ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే ప్రధాని మోదీ పెట్టుకున్నారని.. ఈ జనరేషన్ చావుకు, ఐటీ, ఈడీ సోదాలకు భయపడేది కాదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ.. మేక్ ఇన్ ఇండియా అడిగితే లీక్ ఇన్ ఇండియా ఇచ్చారంటూ సెటైర్లు వేశారు. న్యాయం చేయాలని విద్యార్థులు అడుగుతున్నారని, వారికి అండగా నిలబడతామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీపై కొట్లాడితే చోటాభాయ్‌కు ఎందుకు కోపం వస్తుందో అర్థం కావడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చురకలు అంటించారు. మోదీ అంటే రేవంత్‌కు ఎందుకంత భయమంటూ ప్రశ్నించారు.

# పదేళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా..

ఢిల్లీ, జులై 24 ప్రభాత సూర్యుడుNEET, JEE వంటి పోటీ పరీక్షల్లో వరుస పేపర్ లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. పేపర్ లీకేజీలకు పాల్పడే వ్యవస్థీకృత గ్యాంగ్‌లు, నిందితులపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలుగా 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్, 2024' చట్టానికి సవరణలు చేసేందుకు ఇవాళ జరిగిన కేంద్ర కేబినెట్ భేటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.




### కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచేందుకు, పేపర్ లీకేజీ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రధాని అధ్యక్షతన ఇవాళ ఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో అత్యంత కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా పేపర్ లీక్ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం తెలిపిన కేంద్రం, అక్రమాలకు పాల్పడేవారికి గరిష్టంగా 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా కఠిన నిబంధనలను పొందుపరిచింది.

అంతేకాకుండా, ఈ కేసుల విచారణను వేగవంతం చేసేందుకు చట్టబద్ధత కలిగిన ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కేవలం కేసు నమోదు, దర్యాప్తు ప్రక్రియలకే పరిమితం కాకుండా, విచారణను ప్రారంభించిన 3 నెలల్లోనే తుది తీర్పు వెలువడేలా నూతన చట్టంలో స్పష్టమైన నిబంధనలను చేర్చింది.

### ప్రస్తుతం ఉన్న చట్టం ఏం చెబుతోంది?

2024 జూన్‌లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం.. వ్యక్తిగతంగా అక్రమాలకు పాల్పడితే 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10 లక్షల వరకు జరిమానా విధిస్తారు. అదే గ్యాంగ్‌లు/వ్యవస్థీకృత నెట్‌వర్క్‌గా లీకేజీలకు పాల్పడితే 5 నుంచి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. 1 కోటి వరకు జరిమానా విధించే నిబంధన ఉంది. ఇప్పుడు ఈ శిక్షలను మరింత కఠినతరం చేయనున్నారు.

### ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీలు:

సభలో విస్తృత చర్చ: ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో పేపర్ లీకేజీలు, విద్యా సంస్కరణలపై సమగ్ర చర్చ జరుపుతామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం: నీట్ పేపర్ లీక్ ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం అందించేందుకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు. శాంతియుత నిరసనకారులపై కేసులు నమోదు చేయరు: శాంతియుతంగా ఆందోళన తెలిపిన విద్యార్థులు, యువతపై ఎలాంటి కేసులు పెట్టబోమని హామీ ఇచ్చారు. సభలో విపక్షాల ఆందోళనలు, బయట విద్యార్థుల నిరసనల నడుమ కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని మరింత కఠినతరం చేయడం ద్వారా విద్యార్థుల్లో, తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు వేగంగా అడుగులు వేస్తోంది.

# మరోసారి సీజేపీ నేతలతో చర్చిస్తాం: జేపీ నడ్డా



న్యూఢిల్లీ, ప్రభాత సూర్యుడుకాక్రోచ్ జనతా పార్టీ నేతలతో భేటీ అనంతరం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా మీడియాతో మాట్లాడారు. దాదాపు రెండు గంటల పాటు చర్చలు జరిగాయని తెలిపారు. సీజేపీ నేతలు తమ ముందు మూడు ముఖ్యమైన డిమాండ్లను ఉంచారని వెల్లడించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీ నామా విషయంపైశనివారం మధ్యాహ్నంమరోసారివారితో చర్చలు జరుపుతామని అన్నారు.

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సీజేపీ పట్టు..

శుక్రవారం మధ్యాహ్నం కాన్‌స్టిట్యూషనల్ క్లబ్ ఆఫ్ ఇండియాలో కేంద్ర మంత్రులు, సీజేపీ నేతల మధ్య దాదాపు రెండు గంటలు చర్చలు జరిగాయి. నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి సంబంధించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని.. అలా కాకపోతే ఆయనను పదవి నుంచి తొలగించాలని సీజేపీ నేతలు పట్టుబట్టారు. చర్చల అనంతరం సీజేపీ నేత అశుతోష్ రంక మీడియాతో మాట్లాడుతూ.. 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వం ఓ రోజు సమయం అడిగింది. ప్రభుత్వం ఆయనను త్వరగా విధులనుంచి తొలగిస్తుందని అనుకుంటున్నా ము. కేంద్రం మా రెండు డిమాండ్లకు ఒప్పుకుంది. పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వడానికి, విద్యా ర్థులపై కేసులను విత్ డ్రా చేసుకోవడానికి ప్రభుత్వం అంగీకరించింది' అని తెలిపారు.



# నాలా గయాబ్.. రోడ్లు బంద్

## - గేటెడ్ కమ్యూనిటీ ముసుగులో నిబంధనలకు తూట్లు?
## - అధికారుల మౌనం వెనుక మర్మమేంటి?



### నిబంధనలు అతిక్రమించి నిర్మిస్తున్న నిర్మిస్తున్న వెంచర్

పెద్ద అంబర్‌పేట్ -- ప్రభాత సూర్యుడు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నాగోల్ సర్కిల్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ కేంద్రంలో విజయవాడ జాతీయ రహదారిని ఆనుకుని అభివృద్ధి చేస్తున్న ఓ గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గేటెడ్ కమ్యూనిటీ పేరుతో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రజల రాకపోకలకు ఉపయోగపడే రోడ్లను ప్రహరీ గోడలతో మూసివేయడమే కాకుండా, సహజ నీటి ప్రవాహానికి మార్గమైన నాలాను సైతం కనుమరుగు చేశారంటూ స్థానికులు మండిపడుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. పెద్ద అంబర్‌పేట్ ఈదుల చెరువు నుంచి చౌటకుంటకు వెళ్లే సర్వే నంబర్ 112 తదితర ప్రాంతాల్లో ఉన్న సహజ కాల్వ ఈ వెంచర్ మధ్యగానే ఉండేదని, ప్రస్తుతం అది పూర్తిగా కనిపించకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగితే సమీప కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా, గతంలో ఇరిగేషన్ మరియు హైడ్రా అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి, బఫర్ జోన్‌లో నిర్మాణాలు జరిగినట్లు గుర్తించారని, ఆ సమయంలో కొంతమేర కూల్చివేత చర్యలు కూడా చేపట్టినట్లు స్థానికులు గుర్తు చేస్తున్నారు. అయినప్పటికీ అదే ప్రాంతంలో మళ్లీ నిర్మాణాలు జోరుగా సాగుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. హెచ్‌ఎండీఏ అనుమతుల పేరుతో లక్షల రూపాయలకు ప్లాట్లు విక్రయిస్తూ, ప్రజా రహదారులను సైతం ప్రహరీ గోడలతో మూసివేస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ రహదారులు, డ్రైనేజీ మార్గాలు, నాలాలను ఆక్రమించే అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. ఆశ్చర్యకరమైన



### గేటెడ్ కమ్యూనిటీ పేరుతో రోడ్లను మూసేసి నిర్మిస్తున్న వెంచర్ కాంపౌండ్ వాల్

విషయం ఏమిటంటే, ఈ వెంచర్ మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉండటం. అయినప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ యంత్రాంగం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణం ప్రారంభం నుంచి స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా స్పందన లేకపోవడం అధికారుల పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తోంది. "ఒకవైపు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతుంటే, మరోవైపు ఇలాంటి భారీ వెంచర్‌లో నిబంధనల ఉల్లంఘనలు ఎలా జరుగుతున్నాయి? ఎవరి అండదండలతో ఈ నిర్మాణాలు కొనసాగుతున్నాయి?" అనే ప్రశ్నలు స్థానికుల్లో వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపి, వెంచర్‌కు సంబంధించిన అన్ని అనుమతులను బహిర్గతం చేయాలని, సహజ నాలాలు, ప్రజా రహదారులపై ఆక్రమణలు జరిగి ఉంటే వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే భవిష్యత్తులో పర్యావరణ, వరద సమస్యలకు బాధ్యులు ఎవరో అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

## విద్య జీవిత గమనాన్నే మార్చి వేస్తుంది.

**వనవాసీ ప్రాంత సంఘటనా కార్యదర్శి వేముక.**



చర్ల, జూలై 24ప్రభాత సూర్యుడు. విద్య జీవిత గమనాన్నే మార్చి వేస్తుందని వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత సంఘటనా కార్యదర్శి వేముక ఆంజనేయులు అన్నారు. చర్ల వాసి ప్రస్తుతం ఖమ్మంలో స్థిరపడిన పగడాల విజయ్ కుమార్ - కవిత దంపతుల కుమారుడు కెనడాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి పగడాల శ్రీహర్ష జన్మదినం పురస్కరించుకొని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం, శబరి బాలికా విద్యార్థి నిలయం విద్యార్థులకు అర క్వింటా బియ్యం, ఒక పూట భోజనం, టూత్ పేస్టు, బ్రష్ లు, పండ్లను అందచేసారు. ఈ సందర్భంగా కొమరం భీం నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆంజనేయులు విద్యార్థులను ఉద్దేసించి మాట్లాడారు. చదువుతోనే సార్థకత ఉంటుందని, ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టిసారించి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడి నిలయ స్థితిగతులు, విద్యార్థుల క్రమశిక్షణ దాతలను ఆకట్టుకున్నాయని తెలిపారు. దీంతో అనేకమంది దాతలు చదవులకు సహకరించడం సంతోషకరమని పేర్కొన్నారు. వనవాసీ సంస్థ అవసరాలను తీర్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ వారు ముందుకు రావడం అబినందనీయమని పేర్కొన్నారు.

## త్రాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట కార్యాచరణ.. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్.

**అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం, జూలై 24 ప్రభాత సూర్యుడు. ఎల్నినో దృష్ట్యా జిల్లాలో త్రాగునీటి



ఎద్దడి లేకుండా పకడ్బందీ కార్యాచరణ చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో త్రాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ పంటల అవగాహనపై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి, జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామం వారీగా త్రాగునీటి సరఫరాపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. గ్రామాలు మిషన్ భగీరథ నీటిపై ఆధారపడేవి, స్థానిక వనరుల లభ్యతపై స్పష్టంగా స్టడీ చేయాలని, ఏ ఏ వనరులని వాడుకోవచ్చు, ఏ ఏ వనరులను రీ జనరేట్ చేసుకోవచ్చొ చూడాలన్నారు. గ్రామ గ్రామం క్షేత్ర స్థాయిలో సందర్శించి నీటి వనరుల గుర్తింపు చేయాలన్నారు. గ్రామ సర్పంచ్ లు, వార్డ్ సభ్యులు, ప్రజాప్రతినిధులతో అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి, ఎల్నినో పరిస్థితులు వివరించి, త్రాగునీటి, సాగునీటి, విద్యుత్ పొదుపుగా వాడడంపై చైతన్యం కల్పించాలన్నారు. వర్షాలు తక్కువగా ఉన్నందున నీటి పొదుపుపై అవగాహన కల్పించి, త్రాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. నీటి వనరులలో నీరు వృధా, మల్లింపు జరగకుండా పటిష్ట నిఘా ఉంచాలన్నారు. త్రాగునీటిపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని, వచ్చే జూన్, జూలై వరకు దృష్టిలో పెట్టుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీ, అంగన్వాడీ, వివో భవనాల నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో ఫామ్ పాండ్ ల గుర్తింపు చేయాలని, సూచించిన లక్ష్యం మేరకు ఫామ్ పాండ్ ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ ఇర్రిగేషన్ ఎం. వెంకటేశ్వర్లు, ఎస్ఈ మిషన్ భగీరథ శేఖర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మునిసిపల్ కమీషనర్లు, ఎంపిడివో లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## విద్యాసంస్థల బంద్ విజయవంతం

**- జంతర్ మంతర్ లాఠీచార్జీకి నిరసనగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆందోళన**



అబ్దుల్లాపూర్‌మెట్ -- ప్రభాత సూర్యుడు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పలు కళాశాలలను బంద్ చేయించి నిరసన కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. విద్యార్థులపై లాఠీచార్జీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. లాఠీలు, నిర్బంధాలతో విద్యార్థి ఉద్యమాలను అణచివేయడం సాధ్యం కాదని, దేశవ్యాప్తంగా విద్యార్థులు, మేధావులు ఈ పోరాటానికి మద్దతుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాషా, సాయి, రోహిత్ చరణ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు నిఖిల్, వెంకట్, సత్యం, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ విద్యార్థులపై లాఠీచార్జికి నిరసనగా సిద్దిపేటలో బిఆర్ఎస్వీ ఆందోళన.. నాయకుల అరెస్ట్



ప్రభాత సూర్యుడు - సిద్దిపేట ఢిల్లీలో తమ హక్కుల కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకులు శుక్రవారం సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమం ఉధృతం కావడంతో పోలీసులు అక్కడికి చేరుకుని బిఆర్ఎస్వీ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో పాత బస్టాండ్ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఢిల్లీలో జరిగిన ఘటనపై తమ నిరసనను వ్యక్తం చేశారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం బాధ్యత వహించాలి

**- ఉచిత హెల్త్ కార్డులు, గ్రూప్ ఇన్సూరెన్స్ పునరుద్ధరించాలి: టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి**

అబ్దుల్లాపూర్‌మెట్ -- ప్రభాత సూర్యుడు జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.




ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజానికి సేవలందిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు కనీస సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. జర్నలిస్టులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందేలా ఉచిత హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని, వారి కుటుంబాలకు భరోసా కల్పించే గ్రూప్ ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, సంఘం బలోపేతానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీమ్ పాషా, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, జిల్లా కోశాధికారి సంరెడ్డి శశిపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జెనిగె పాండు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రవీణ్, సీనియర్ జర్నలిస్టులు



జాల కిషన్, అనంతుల శ్రీనివాస్, సోలిపురం రజనీకాంత్ రెడ్డి, వర్దెల్లి దశరథ, రచ్చా శేఖర్, ఆంజనేయులు, అవంచ సురేందర్, వైద్యులు దివ్యారెడ్డి, శ్రేయాన్, మార్కెటింగ్ టీమ్ సభ్యులు సందీవ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. టీయూడబ్ల్యూజే అబ్దుల్లాపూర్‌మెట్ నూతన మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే అబ్దుల్లాపూర్‌మెట్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గూడెపు జగన్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నామా ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడిగా శ్రీరాం యాదయ్య, ఉపాధ్యక్షులుగా కట్టంగూరు మల్లేష్, గండికోట సత్యం, నాగార్జున, జాయింట్ సెక్రటరీలుగా చెరుకు ఉపేందర్ గౌడ్, పోలగోని రాజేష్ గౌడ్, కుకుట్లపల్లి రాకేష్, కోశాధికారిగా బండ శేఖర్ రెడ్డి, సలహాదారులుగా గడ్డం భాస్కర్ రెడ్డి, రాసాల వెంకటేష్ యాదవ్ ఎన్నికయ్యారు.

## పలువురి కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు



ప్రభాత సూర్యుడు - సిద్దిపేట మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు శుక్రవారం సిద్దిపేట పట్టణంలో పలువురు కుటుంబాలను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల మృతి చెందిన సిద్దిపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి భగవాన్ రెడ్డి తండ్రి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. అలాగే గౌడ సంఘం నాయకులు యాదగిరి గౌడ్ మృతి పట్ల వారి కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. హనుమాన్ నగర్‌కు చెందిన పెంబర్ల కుమార్ మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా బాగు సంతోష్ కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. అనంతరం, ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందిన సీనియర్ జర్నలిస్ట్ సంజీవ్ రెడ్డి తండ్రి నర్సింహా రెడ్డిని ఇమామ్‌బాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హరీష్ రావు భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



## విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దు

**నీట్ అంశంపై కాంగ్రెస్ వైఖరికి వ్యతిరేకంగా బీజేపీ నిరసన.. నాచారంలో రాస్తారోకో**

నాచారంప్రభాత సూర్యుడు నీట్ ప్రవేశ పరీక్ష అంశంలో కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల జీవితాలతో రాజకీయాలు చేస్తోందని ఆరోపిస్తూ బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు నాచారంలో నిరసన చేపట్టారు. ప్రధాన రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీజేపీ నాయకులకు మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ



# భారత రక్షణ రంగానికి అత్యాధునిక మానవరహిత వైమానిక వ్యవస్థలు...

## ఇన్‌ఫోర్టెకార్ప్ సొల్యూషన్స్ -- ఏరో సొల్యూషన్స్ యూఏవీ సంస్థల సంయుక్త వెంచర్









ఫార్న్‌బరో (/యునైటెడ్ కింగ్‌డమ్), జూలై 20 ప్రభాత సూర్యుడ్ కరోస్పాండంట్ భారత రక్షణ, అంతర్గత భద్రత రంగాలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ఇన్‌ఫోర్టెకార్ప్ సొల్యూషన్స్ లిమిటెడ్ మరియు ఏరో సొల్యూషన్స్ యూఏవీ లిమిటెడ్ సంస్థలు సంయుక్త వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాయి. ఈ భాగస్వామ్యం ద్వారా భారత మార్కెట్‌కు అత్యాధునిక మానవరహిత వైమానిక వ్యవస్థలు, శత్రు డ్రోన్‌లను గుర్తించి అడ్డుకునే కౌంటర్-డ్రోన్ సాంకేతికతలను అందించనున్నారు.భారతదేశంలో రక్షణ, సరిహద్దు భద్రత, అంతర్గత భద్రత అవసరాలు రోజురోజుకూ విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ సంయుక్త వెంచర్ కీలక పాత్ర పోషించనుంది. ఇన్‌ఫోర్టెకార్ప్ సంస్థకు ఉన్న రక్షణ రంగ వ్యాపార అభివృద్ధి, వ్యూహాత్మక భాగస్వామ్యాలు, మార్కెట్ అనుభవానికి, ఏరో సొల్యూషన్స్ యూఏవీ సంస్థకు ఉన్న అత్యాధునిక డ్రోన్ సాంకేతికత తోడవడంతో భారత రక్షణ రంగానికి ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుంది.'వెనమ్ ఇంటర్‌సెప్టర్' డ్రోన్ ప్రత్యేక ఆకర్షణ ఈ సంయుక్త వెంచర్ ద్వారా భారతదేశానికి 'వెనమ్ ఇంటర్‌సెప్టర్ యూఏవీ' అనే ప్రత్యేక కౌంటర్-డ్రోన్ వ్యవస్థను పరిచయం చేయనున్నారు. శత్రు లేదా అనుమతి లేని డ్రోన్‌లను అత్యంత వేగంగా గుర్తించి, వాటిని వెంబడించి, నిర్వీర్యం చేయడానికి ఈ వ్యవస్థను ప్రత్యేకంగా రూపొందించారు. సైనిక స్థావరాలు, విమానాశ్రయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, కీలక జాతీయ మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలు వంటి అత్యంత భద్రత అవసరమైన ప్రాంతాల రక్షణలో ఇది కీలక పాత్ర పోషించనుంది. వివిధ అవసరాలకు డ్రోన్ పరిష్కారాలువెనమ్ ఇంటర్‌సెప్టర్‌తో పాటు నిఘా, సమాచార సేకరణ, సరిహద్దు మరియు తీర ప్రాంత భద్రత, సముద్ర పర్యవేక్షణ, వ్యూహాత్మక రక్షణ కార్యకలాపాలు, మౌలిక సదుపాయాల తనిఖీలు, విపత్తు నిర్వహణ, సహాయక చర్యలు, పర్యావరణ పర్యవేక్షణ వంటి అనేక రంగాలకు అనువైన ఆధునిక మానవరహిత వైమానిక వ్యవస్థలను కూడా ఈ సంయుక్త వెంచర్ అందించనుంది. ఆత్మనిర్భర్ భారత్‌కు బలంఈ భాగస్వామ్యం ద్వారా భారతదేశంలోనే సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, స్థానిక పరిశ్రమలతో భాగస్వామ్యాలు, తయారీ, వ్యవస్థల సమీకరణ, శిక్షణ, నిర్వహణ, మరమ్మతులు, విడిభాగాల సరఫరా వంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమానికి బలం చేకూరడంతో పాటు భారత రక్షణ రంగంలో స్వదేశీ సామర్థ్యాలు మరింత పెరుగుతాయని సంస్థలు వెల్లడించాయి. ఇన్‌ఫోర్టెకార్ప్ సొల్యూషన్స్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకులు రాజు కీర్చిపల్లి, నీల చరణ్ మాట్లాడుతూ, భారతదేశానికి అత్యాధునిక మానవరహిత వైమానిక వ్యవస్థలు, కౌంటర్-డ్రోన్ సాంకేతికతలను అందించేందుకు ఏరో సొల్యూషన్స్ యూఏవీతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. స్థానిక పరిశ్రమలతో కలిసి పనిచేస్తూ సాంకేతిక ఆవిష్కరణలు, స్వదేశీ సామర్థ్యాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.ఏరో సొల్యూషన్స్ యూఏవీ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వాహణ అధికారి స్టీవర్ట్ క్లిఫోర్డ్ మాట్లాడుతూ, ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న అత్యంత కీలకమైన రక్షణ మార్కెట్లలో భారత్ ఒకటని పేర్కొన్నారు. ఈ సంయుక్త వెంచర్ ద్వారా వెనమ్ ఇంటర్‌సెప్టర్‌తో పాటు తమ సంస్థ అభివృద్ధి చేసిన ఆధునిక మానవరహిత వ్యవస్థలను భారతదేశానికి అందించనున్నామని, దేశ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దీర్ఘకాలిక పారిశ్రామిక, సాంకేతిక భాగస్వామ్యాలను నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# విద్యార్థుల హక్కుల కోసం బీఆర్ఎస్వీ పోరాటం కొనసాగుతుంది.

### వైరా నియోజకవర్గ నాయకుడు జూపల్లి రాము. నీట్ పేపర్ లీక్‌పై కేంద్రాన్ని నిలదీసిన జూపల్లి రాము -- ధర్మేందర్ ప్రధాన్ రాజీనామాకు డిమాండ్

సింగరేణి జులై 24 ప్రభాత సూర్యుడు నీట్ పేపర్ లీక్ ఘటనపై విద్యార్థులకు అండగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్వీ వైరా నియోజకవర్గ నాయకుడు, సింగరేణి మండల నాయకుడు జూపల్లి రాము పాల్గొన్నారు.ఈ సందర్భంగా జూపల్లి రాము మాట్లాడుతూ ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేందర్ ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.ఈ మహా ధర్నాలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థుల సమస్యలపై తమ గళాన్ని వినిపించారు.




# ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు పెంచాలి...



దుమ్ముగూడెం జులై 24 ప్రభాత సూర్యుడు ప్రభుత్వ జూనియర్ కళాశాల దుమ్ముగూడెం భద్రాద్రి కొత్తగూడెం డి ఐ ఈ ఓ శ్రీ హెచ్ వెంకటేశ్వర రావు ఆకస్మికంగా తనిఖీ చేసినారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అధ్యాపక సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి అడ్మిషన్లు పెంచాలని, అడ్మిషన్ అయిన ప్రతి విద్యార్థినీ యుడైస్ నందు నమోదు చేయాలని ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలని జాయిన్ అయినా ప్రతి విద్యార్థి ఎగ్జామ్ ఫీజు కట్టే విధంగా చూడాలని ప్యానల్ బోర్డ్ లను ఉపయోగించి విద్యాబోధన చేయాలని సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని పలు సూచనలు చేసినారు



అనంతరం విద్యార్థులతో ముచ్చటిస్తూ విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరు కావాలని అధ్యాపకులు చెప్పినవి ప్రతిరోజు ఇంటిదగ్గర నేర్చుకోవాలని అదేవిధంగా ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకంలోని అంశాలను క్షుణ్ణంగా నేర్చుకోవాలని వారి ఊర్లలో ఉన్న పదవ తరగతి చదివి మానేసిన విద్యార్థులను మన కళాశాలలో చేరే విధంగా చూడాలని ఎప్సెట్ నీట్ క్లాట్ వంటి ఎగ్జామ్స్ లో నైపుణ్యం సాధించాలని పలు సూచనలు చేసినారు అదేవిధంగా పలు రికార్డులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేడం శ్రీమతి సిహెచ్ కృష్ణవేణి సీనియర్ అధ్యాపకులు వరరాజు పవన్ కుమార్ ఇతర అధ్యాపక అధ్యాపకేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

# మంగపేట మండలం ఫోటోగ్రాఫర్ల నూతన కమిటీ ఎన్నిక



ములుగు జూలై 24 ప్రభాత సూర్యుడుములుగు జిల్లా మంగపేట మండల ఫోటోగ్రాఫర్ల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా వడ్లకొండ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా మయూరి నరేష్, కోశాధికారిగా ఉగ్గుమల్ల గణేష్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా సభ్యులు నూతన పదాధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫోటోగ్రాఫర్ల సంక్షేమం, వృత్తి అభివృద్ధి, సభ్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఐక్యంగా పనిచేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలి.

### రాజకీయ పార్టీల సహకారంతో ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు నమోదు చేయాలి కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

ములుగు జూలై 24 ప్రభాత సూర్యుడుములుగు జిల్లా కేంద్రంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, 2026 జూన్ 25 నుంచి బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తూ ప్రతి ఓటరు నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరిస్తున్నారని తెలిపారు. జిల్లాలో సుమారు 83.03 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్లు, బూత్ లెవల్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రతి బూత్ పరిధిలో మిగిలి ఉన్న ఓటర్లను మరోసారి సంప్రదించి, పెండింగ్‌లో ఉన్న ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటైజేషన్‌ను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.బీఎల్ఓ యాప్ ద్వారా వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, డిజిటైజ్ చేసిన ఫారాలను వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. అవసరమైన చోట రీ-విజిట్ నిర్వహించి, ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా మిగిలిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆగస్టు 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఓటర్ల పేర్ల చేర్పు, సవరణలు, తొలగింపులు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే జరుగుతాయని స్పష్టం చేశారు. ఓటరు మరణించినా లేదా ఇతర కారణాలతో పేరు తొలగించాల్సిన సందర్భాల్లో కూడా నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి, డిడబ్ల్యూఓ ప్రేమలత, తహసీల్దార్ విజయ భాస్కర్, ఎన్నికల సిబ్బంది సలీం, నితీష్, రమాదేవి, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# కేటీఆర్ జన్మదినం సందర్భంగా చిన్నారి జాహ్నవి రూ.20 వేల ఆర్థిక సాయం

### మండల అధ్యక్షులు గంప రాంబాబు



ములుగు జూలై 24, ప్రభాత సూర్యుడుకల్వకుంట్ల తారక రామారావు కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని వెంకటాపురం ప్రభుత్వ అతిథి గృహంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొడవర్తి నరసింహమూర్తి అధ్యక్షతన మండల అధ్యక్షులు గంప రాంబాబు ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి బీఆర్ఎస్ పార్టీ నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోన్ మ్యారో సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారి జాహ్నవి చికిత్స కోసం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు రూ. 20,000 ఆర్థిక సహాయం అందజేశారు.చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న నాయకులు, ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఈ సహాయాన్ని అందించారు. సమాజంలోని దాతలు కూడా ముందుకు వచ్చి చిన్నారి చికిత్సకు చేయూత నివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మంచర్ల నాగేష్ ,బట్టా నాగేంద్రబాబు, గడ్డం వివేక్ సర్పంచ్ లు ఇర్ప మురళి,పూజారి ఆదిలక్ష్మి కార్యకర్తలు, బొగ్గుల రాజు కుటుంబ సభ్యులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

### భారీ వాహనాలపై ప్రత్యేక నిఘా.. ట్రాఫిక్ సీఐ శివశంకర్ హెచ్చరిక

దమ్మాయిగూడ జూలై 24 ప్రభాత సూర్యుడుజవహర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడ చౌరస్తాలో అనుమతి లేని సమయంలో రాకపోకలు సాగిస్తున్న టిప్పర్ లారీని ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. భారీ వాహనాల రాకపోకలకు అనుమతి లేని సమయంలో లారీ తిరుగుతుండటాన్ని గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల తనిఖీల్లో లారీపై ఇప్పటికే రూ.17 వేల జరిమానా ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. నిబంధనలు ఉల్లంఘిస్తూ భారీ వాహనాలు తిరగకుండా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నారు.



# దుమ్ముగూడెం మండలం, కాశి నగరం గ్రామంలో మహా లక్ష్మీ అమ్మవారికి అభిషేకాలు.

దుమ్ముగూడెం జులై 24 ప్రభాత సూర్యుడు.దుమ్ముగూడెం మండలం, కాశీ నగరం గ్రామంలో ఒక రైతు పొలం దున్నుతుండగా ఆకస్మాత్ గా నాగలికి గట్టిగా తగలడం వలన ఏమిటి అని పరిశీలించగా అమ్మవారి రాతి విగ్రహం బయట పడింది, అలా మట్టి లో బయట పడిన అమ్మవారు ఆషాఢ బోనాలు జరుగుతున్న సందర్భంలో దొరకడం వలన ఈ అమ్మవారిని మహా లక్ష్మి అమ్మవారుగా గ్రామస్థులు భావిస్తున్నారు, ఆ మహా లక్ష్మి అమ్మవారిని ఈ రోజు ఘనంగా అభిషేకాలు, బోనాలు సర్పంచ్ మట్టా, వెంకటేశ్వరరావు ఆధ్వర్యం లో వేద పండితులు రాఘవ శర్మ అభిషేకాలు, వేద మంత్రాలతో కుంకుమ పూజ, అమ్మవారు ప్రతిష్ఠ కార్యక్రమం భారీ సంఖ్యలో హాజరైన భక్తుల తో నిర్వహించారు,






## ఈ దృశ్యం చూసి 'జై బాబు- జై బండ్ల' అంటూ ఫ్యాన్స్ రచ్చ!

ఈ వివాహ వేడుక కోసం బండ్ల గణేష్ స్వయంగా వెళ్లి సూపర్‌స్టార్ మహేష్ బాబు, శ్రీమతి నమ్రత శిరోద్కర్ జంటను ఆప్యాయంగా ఆహ్వానించారు. నటుడు, ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్ ఇంట త్వరలోనే పెళ్లి బాజాలు మోగబోతున్నాయి. తన కుమార్తె జనని వివాహ వేడుకను ఎంతో అట్టహాసంగా నిర్వహించేందుకు ఆయన సన్నాహాలు చేస్తున్నారు. ఆగస్టు 16న హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ శుభకార్యానికి సంబంధించి ఇప్పటికే వివాహ పత్రికల పంపిణీ శరవేగంగా సాగుతోంది.



ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో జనని సూర్యప్రణామ్- అనే హాష్‌ట్యాగ్‌తో బండ్ల గణేష్ షేర్ చేసిన పోస్ట్ ఇప్పుడు ఫిలిం నగర్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వివాహ వేడుక కోసం బండ్ల గణేష్ స్వయంగా వెళ్లి సూపర్‌స్టార్ మహేష్ బాబు, శ్రీమతి నమ్రత శిరోద్కర్ జంటను ఆప్యాయంగా ఆహ్వానించారు. ఈ ఆదర్శ జంటతో విలువైన సమయం గడిపిన బండ్ల వారి ఆదరాభిమానాలను మర్చిపోలేనని అన్నారు. మహేష్ వినయం, ఆత్మీయతను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ.. తన కుటుంబ యోగ క్షేమాలను మహేష్ బాబు అడిగారని తెలిపారు. ముఖ్యంగా ఎంతగా ఎదిగినా మహేష్ బాబు సింప్లిసిటీ, మానవత్వం హృదయాన్ని హత్తుకున్నాయని తెలిపారు.బండ్ల గణేష్ పోస్ట్ చూసిన అభిమానులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున స్పందించారు. ముఖ్యంగా ఫోటోలో



మహేష్ బాబు కొత్త లుక్ ఎంతో అద్భుతంగా ఉందంటూ -అంబానీ వెడ్డింగ్ లుక్‌ని బీట్ చేస్తున్నారు- అని ఫ్యాన్స్ కామెంట్స్ వర్షం కురిపించారు. -జై బాబు- అనే నినాదాలతో కామెంట్ సెక్షన్ నిండిపోగా, ఒక అభిమాని ఏకంగా ప్రపంచంలోని దాదాపు అన్ని భాషల్లో -జై బాబు- అని టైప్ చేసి తన అభిమానాన్ని చాటుకోవడం విశేషం. జై బాబు లానే కొందరు జై బండ్ల అని కూడా కామెంట్ చేస్తున్నారు. ఈ పెళ్లి ఆహ్వానాల పర్వంలో కేవలం మహేష్ బాబు మాత్రమే కాకుండా... టాలీవుడ్‌లోని అగ్ర నటులు మెగాస్టార్ చిరంజీవి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సహా ఇండస్ట్రీలోని దాదాపు టాప్ 50 సెలబ్రిటీలు బండ్ల గణేష్ కుమార్తె వివాహానికి ప్రత్యేక ఆహ్వానాలు అందుకున్నారు. ఇండస్ట్రీలో అందరితో మంచి సంబంధాలు ఉన్న బండ్ల గణేష్.. ప్రతి ఒక్కరినీ స్వయంగా కలిసి ఆహ్వానిస్తుండటంతో ఈ వేడుకపై అందరి దృష్టి నెలకొంది.

## 'ది ఒడిస్సీ'ని మహాభారతంతో పోల్చిన ఆషీకారంగనాథ్!

ఈ సినిమాలోని కొన్ని కీలక అంశాలు మన పురాణాలైన మహాభారతాన్ని తలపించేలా ఉన్నాయని ఆషీకా అభిప్రాయపడ్డారు.హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన -ది ఒడిస్సి- వరల్డ్ వైడ్ ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చెప్పాల్సిన పనిలేదు. భారత్ లోనూ సినిమాకు అసాధారణమైన ఫాలోయింగ్ దక్కుతోంది. రొటీన్ సినిమాలు చూసి బోర్ కొట్టిన జనాలంతా ఒడిస్సీ వైపు మళ్లుతున్నారు. -అవతార్- తర్వాత ఆ రేంజ్ సినిమా లేకపోవడంతో? ఒడిస్సికి ప్రేక్షకులంతా పట్టం కడుతున్నారు. సినిమా లో శాస్త్రీయత, మానసిక భావోద్వేగాలు , విజువల్ వండర్స్ ఎంతగానో ఆకట్టుకుం టున్నాయి. తాజాగా ఈసినిమా గురించి టాలెంటెడ్ హీరోయిన్ ఆషికా రంగనాథ్ చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ సినిమాలోని కొన్ని కీలక అంశాలు మన పురాణాలైన మహాభారతాన్ని తలపించేలా ఉన్నాయని ఆషీకా అభిప్రాయపడ్డారు. క్రిస్టోఫర్ నోలన్ కథా శైలి , ఆయన ఎంచుకున్న దృశ్యాలు తనను ఎంతగానో ఆకట్టుకుంటాయని పేర్కొన్నారు. -ది ఒడిస్సీ- చిత్రానికి సంబంధించిన విశేషాలను పరిశీలిస్తు న్నప్పుడు అందులోని సంఘర్షణలు, పాత్రల ప్రయాణం అచ్చం మన భారతీయ ఇతిహాసమైన మహాభారతంలోని ఘట్టాలను గుర్తుచేశాయని వెల్లడించారు. పశ్చిమ దేశాల పురాణ గాథ అయినప్పటికీ అందులో లోతైన భావోద్వేగాలు.. సత్యాలను పోలి ఉన్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గొప్ప కథలన్నీ మానవ స్వభావం, ధర్మం, పోరాటం చుట్టూనే తిరుగుతాయని చెప్పడానికి ఈ పోలిక ఉదాహరణగా నిలుస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. హాలీవుడ్ స్థాయి టెక్నాలజీతో తెరకెక్కిన ఇలాంటి గ్లోబల్ ప్రాజెక్ట్‌లు భారతీయ సాంస్కృతిక ఇతిహాసాలతో ఎంతగా కనెక్ట్ అయి ఉంటాయో ఈ వ్యాఖ్యలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. ఆషికా రంగనాథ్ చేసిన కామెంట్స్ చర్చకే పరిమితం కాలేదు. ఈస్ట్ .. వెస్ట్ కల్చర్స్ మధ్య ఉన్న కథా పరమైన సారూప్యతలను బయటపెట్టాయి. ఏ దేశంలో పుట్టిన కథ అయినా? మూలాలు , నైతిక విలువలు ఒకేలా ఉంటాయని చెప్పడానికి ఇది నిదర్శనమని మరోసారి తేట తెల్లమవుతోంది. -అవతార్- కాన్సెప్ట్ కూడా భారత్ మూలాల నుంచి తీసుకున్నదే. ఆసినిమాలో పాండోరా ప్రపంచం, నావి జాతి జీవన విధానం, ప్రకృతితో వారికున్న విడదీయరాని అనుబంధం ఇవన్నీ అచ్చమైన భారతీయ సంస్కృతికి, హిందూ పురాణాలకు అద్దం పడుతున్నట్లుగా ఉంటుందనే చర్చ ఎప్పట్నుంచో ఉంది. ముఖ్యంగా ఈ చిత్రంలోని పలు కీలక అంశాలు భారత దేశపు ప్రాచీన మూలాలను గుర్తు చేస్తుంటాయి. సినిమాలో మానవులు నీలం రంగులో చూపించే నావి జాతి పాత్రలు, వాటి రూపురేఖలు హిందూ పురాణాల్లోని దైవిక రూపాలను పోలి ఉంటాయి.హిందూ ధర్మంలో మహావిష్ణువు అవతారాలైన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి దైవిక శక్తులు నీలం రంగు లో వర్ణించబడ్డాయి. అచ్చం అలాగే అవతార్ చిత్రంలోని జీవులకు కూడా నీలం రంగు లో కనిపించడం.. వాటిని ప్రకృతి రక్షకులుగా చూపించడం గమనించదగ్గ విషయం. అంతేకాదు సంస్కృత పదమైన అవతారం అనే పదాన్ని నేరుగా ఈ చిత్రానికి శీర్షికగా వాడటం దీనికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. సినిమాలో చూపించిన ప్రకృతి ఆరాధన విధానం భారతీయ సనాతన ధర్మానికి అత్యంత దగ్గరగా ఉంటుంది. చెట్లను, అడవులను, జీవరాశు లన్నింటినీ దైవంగా భావించి పూజించడం, ప్రకృతికి హాని తలపెట్టకుండా మమేకమై జీవించడం మన సంప్రదాయం. ఇదంతా అవతార్ లో చూసిందే కదా.



## గీత గోవిందం మ్యాజిక్ ఎక్కడ ఆగింది?

చిన్నగా కనిపించిన ప్రేమకథను కుటుంబ ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కించడం, ఎంటర్టైన్మెంట్ ను యాడ్ చేయడం పరశురామ్ ప్రత్యేకతగా నిలిచింది. ఒక సినిమా.. ఒక దర్శకుడి కెరీర్ ను ఒక్కసారిగా మార్చేస్తుంది. అదే సినిమా తర్వాత వచ్చే అంచనాలు మాత్రం అతడికి పెద్ద సవాల్ గా మారతాయి. టాలీవుడ్ లో ఇలాంటి జర్నీకి ఎగ్జాంపుల్ గా దర్శకుడు పరశురామ్ పేరు చెప్పుకోవచ్చు. గీత గోవిందం మూవీతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆ డైరెక్టర్.. ఆ తర్వాత అదే స్థాయి విజయాన్ని అందుకోవడానికి చేసిన ప్రయత్నాలు మాత్రం అనుకున్నంతగా సక్సెస్ అవ్వలేదు. 2 విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా తెరకెక్కిన గీత గోవిందం 2018లో విడుదలై సంచలన



విజయం సాధించింది. చిన్నగా కనిపించిన ప్రేమకథను కుటుంబ ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కించడం, ఎంటర్టైన్మెంట్ ను యాడ్ చేయడం పరశురామ్ ప్రత్యేకతగా నిలిచింది. ఆ సినిమాతో ఆయనకు దర్శకుడిగా భారీ డిమాండ్ వచ్చింది. స్టార్ హీరోలు కూడా ఆయనతో సినిమా చేయడానికి ఆసక్తి చూపించే స్థాయికి వెళ్లారు.అయితే ఒక భారీ విజయాన్ని అందుకున్న తర్వాత అదే స్థాయి మ్యాజిక్ ను మళ్లీ క్రియేట్ చేయడం ప్రతి దర్శకుడికీ అంత ఈజీ కాదు. పరశురామ్ విషయంలోనూ అదే జరిగింది. సూపర్ స్టార్ మహేష్ బాబుతో తెరకెక్కించిన సర్కారు వారి పాటపై భారీ అంచనాలు ఉన్నా.. సినిమా ప్రేక్షకులను పూర్తిగా మెప్పించలేకపోయింది. ఆ తర్వాత విజయ్ దేవరకొండతో వచ్చిన ఫ్యామిలీ స్టార్ కూడా ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. ఇక్కడే అసలు పరీక్ష మొదలైంది. గీత గోవిందం మూవీ తర్వాత పరశు రామ్ నుంచి ఆడియన్స్ మరింత స్ట్రాంగ్ స్టోరీలను ఆశించారు. కానీ ఒక దర్శకుడికి విజయంతో పాటు అంచనాల భారం కూడా పెరుగుతుంది. గతంలో చిన్న కథతో ఆకట్టుకున్న దర్శకుడు.. స్టార్ హీరోలతో సినిమా చేసే సమయంలో అదే రేంజ్ లో స్టోరీ, స్కేల్, ఎమోషన్ ను బ్యాలెన్స్ చేయాల్సిన పరిస్థితి వస్తుంది. సినిమాస్ట్రీమింగ్ సినిమా ఇండస్ట్రీలో దర్శకుడి ప్రయాణం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఒక హిట్ తో అవకాశాలు వరుసగా వస్తే.. కొన్ని డిజాస్టర్లు వచ్చిన తర్వాత మళ్లీ తనను తాను నిరూపించుకోవాల్సిన సమయం వస్తుంది. ప్రస్తుతం పరశురామ్ అలాంటి స్టేజ్ లోనే ఉన్నారని చెప్పొచ్చు. ప్రస్తుతం ఆయన కొత్త సినిమా కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. గతంలో స్టార్ హీరోలతో కాంబినేషన్లు చర్చకు వచ్చినా.. ఇప్పుడు సరైన కథ, సరైన హీరో కాంబినేషన్ కోసం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు గీత గోవిందంతో తనలో ఉన్న టాలెంట్ ను నిరూపించిన పరశురామ్.. మరోసారి అదే రేంజ్ విజయాన్ని అందుకుంటారా అన్నదే ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే సినీ ఇండస్ట్రీలో ఒక ఫ్లాప్ దర్శకుడి కెరీర్ ను ముగించదు.. కానీ ఒక కంబ్యాక్ హిట్ మాత్రం రేంజ్ ను మళ్లీ మార్చేస్తుంది. ఇప్పుడు పరశురామ్ ముందున్న టార్గెట్ కూడా అదే. గీత గోవిందం మ్యాజిక్ ను మరోసారి తెరపై చూపించి తన మార్క్ తిరిగి నిలబెట్టుకోవడమే. మరి ఇపట్టికే పలు వార్తలు వస్తున్నా.. నెక్స్ట్ ఎవరితో పరశురామ్ వర్క్ చేస్తారో అంతా వేచి చూడాలి.

## ఓటీటీలో స్ట్రీమింగ్ కి వచ్చేసిన 'నాగ బంధం'.. ఎందులో అంటే!




రీసెంట్ గా మన టాలీవుడ్ నుంచి రిలీజ్ కి వచ్చిన లేటెస్ట్ చిత్రాల్లో యంగ్ హీరో విరాట్ కర్ణ నటించిన చిత్రం 'నాగ బంధం' కూడా ఒకటి. దర్శకుడు అభిషేక్ నామా తెరకెక్కించిన ఈ భారీ పీరియాడిక్ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్ లు ఫీమేల్ లీడ్ లో నటించారు. రిలీజ్ కి ముందు సాలిడ్ హైప్ ని థియేటర్స్ లోకి వచ్చిన ఈ సినిమా ఒకింత మిక్స్ స్పందన అందుకుంది.అయితే మిక్స్ టాక్ వచ్చినప్పటికీ ఓపెనింగ్స్ మాత్రం బాగానే రాబట్టేసింది. ఇక అక్కడ నుంచి కేవలం మూడే వారాల్లో ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. ఈ చిత్రాన్ని ప్రముఖ స్ట్రీమింగ్ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో వారు సొంతం చేసుకోగా అందులో ఇవాళ్టి నుంచి సినిమా అందుబాటులోకి వచ్చేసింది. హిందీ మినహా మిగతా భాషల్లో అందుబాటులోకి వచ్చిన ఈ సినిమా అప్పుడు మిస్ అయ్యి ఓటీటీలో చూడాలి అనుకునేవారు ఇప్పుడు అందులో చూడొచ్చు.

## ఆ విషయంలో రాజమౌళి పాస్.. మరి సందీప్ రెడ్డి వంగా..?



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబోలో రాబోతున్న గ్లోబ్-ట్రాటింగ్ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' టైటిల్ ఎలాంటి వివాదం లేకుండా సునాయాసంగా దక్కింది. దర్శకుడు సుబ్బా రెడ్డి 2023లోనే ఈ టైటిల్‌ను రిజిస్టర్ చేసుకుని కథ కూడా సిద్ధం చేసినప్పటికీ, రాజమౌళికి కావాలని తెలిసి రూపాయి కూడా ఆశించకుండా సంతోషంగా ఇచ్చేశారు.మరోవైపు సందీప్ రెడ్డి వంగా -- ప్రభాస్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న 'స్పిరిట్' సినిమాకు మాత్రం తీవ్ర చిక్కులు ఎదురవుతున్నాయి. 'స్పిరిట్ ఈజ్ నాట్ వన్' అనే ఇండిపెండెంట్ చిత్ర నిర్మాతలు తమ దగ్గర ఈ టైటిల్ హక్కులు ఉన్నాయని వాదిస్తున్నారు. టి-సిరీస్ నుండి తమకు లీగల్ నోటీసులు కూడా వచ్చాయని, చర్చలు విఫలం కావడంతో వారు ఫిలిం ఛాంబర్, సెన్సార్ బోర్డులను ఆశ్రయించారు. ఒకే సమయంలో ఒక సినిమాకు టైటిల్ ఉచితంగా దక్కగా, మరో సినిమా టైటిల్ లీగల్ పోరాటంలో చిక్కుకోవడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.

## 2027 సమ్మర్ బాక్సాఫీస్ టార్గెట్!

కొంత కాలంగా తెలుగు సినిమాలు ఇండియాన్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు నమోదు చేస్తున్నాయో చెప్పాల్సిన పనిలేదు. ఒక సినిమాను మించి మరో చిత్రం భారీ వసూళ్లతో కాక పుట్టిస్తోంది. కొంత కాలంగా తెలుగు సినిమాలు ఇండియాన్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు నమోదు చేస్తున్నాయెూ చెప్పాల్సిన పనిలేదు. ఒక సినిమాను మించి మరో చిత్రం భారీ వసూళ్లతో కాక పుట్టిస్తోంది. ఈనేపథ్యంలో రానున్న సమ్మర్ సీజన్ టాలీవుడ్ చరిత్రలోనే అత్యంత భారీ వ్యాపారానికి, సరికొత్త సంచలనాలకు వేదిక కాబోతోంది. పాన్-ఇండియా స్థాయిలో అగ్ర హీరోలు, దిగ్గజ దర్శకుల కలయికలో తెరకెక్కుతోన్న మోస్ట్ ఎవైటెడ్ ప్రాజెక్ట్‌లు అన్నీ ఒకే సీజన్‌లో క్యూ కట్టడం సినీ వర్గాల్లో ఉత్కంఠను రేకెత్తిస్తోంది. 2027 సమ్మర్ సీజన్ బాక్సాఫీస్ వద్ద ఏకంగా 4000 కోట్ల భారీ బిజినెస్‌ను నమోదు చేసే దిశగా అడుగులు వేస్తోంది. మహా సమ్మర్ రేసులో ముందుగా మార్చి 5న పాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న -స్పిరిట్- విడుదల కానుంది. పోలీసు నేపథ్యంలో అత్యంత పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా వస్తోన్న చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. మార్చి ప్రారంభంలోనే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌తో టాలీవుడ్ సమ్మర్ బాక్సాఫీస్ వేట అత్యంత గ్రాండ్‌గా ప్రారంభం కానుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అటుపై సమ్మర్ వేడిని మరింత పెంచుతూ ఏప్రిల్ 7న దర్శకధీరుడు రాజమౌళి - సూపర్ స్టార్ మహేష్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న గ్లోబ్-ట్రాటింగ్ యాక్షన్ అడ్వెంచర్ -వారణాసి- ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇండియన్ సినిమా చరిత్రలోనే అత్యంత భారీ బడ్జెట్ -హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వాల్యూస్‌తో రూపుదిద్దుకుంటున్న చిత్రంపై గ్లోబల్ మార్కెట్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విడుదల అనంతరం బాక్సాఫీస్ రికార్డులన్నీ తలకిందులు కావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏకంగా 120 దేశాల్లో వారణాసి వసూళ్ల సునామీ సృష్టిస్తుందని భారీ అంచనాలున్నాయి. ఈ ఉత్కంఠకు తోడుగా జూన్ 11న మాస్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న -డ్రాగన్- చిత్రం సమ్మర్ సీజన్‌కు అదిరిపోయే ముగింపునివ్వనుంది. -సలార్-, -కేజీఎఫ్- వంటి ఇండస్ట్రీ హిట్ సినిమాల తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై భారీ అంచనాలున్నాయి. దీంతో ఈ కాంబినేషన్ బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయిలో విధ్వంసం సృష్టిస్తుందో? చెప్పాల్సిన పనిలేదు. అలా మార్చి, ఏప్రిల్, జూన్ నెలల్లో వరుసగా వస్తున్న మూడు భారీ చిత్రాలు తెలుగు చిత్ర పరిశ్రమనే కాకుండా భారతీయ బాక్సాఫీస్ రికార్డుల లెక్కలన్నింటినీ మార్చేయడం ఖాయమని ట్రేడ్ అంచనా వేస్తోంది. ఒకదాని తర్వాత ఒకటిగా రానున్న సంచలన ప్రాజెక్ట్‌ల వల్ల థియేటర్లలో ఎవర్గ్రీన్ పండగ వాతావరణం నెలకొంటుంది. డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు ఈ సీజన్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.




Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555